ఎంఎల్‌సి స్థానానికి నల్లి రాజేష్ నామినేషన్

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి పాలకొల్లుకు చెందిన నల్లి రాజేష్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ పత్రాలను మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.అరుణ్ బాబుకు అందజేశారు. దీంతో ఇప్పటి వరకూ ఒక నామినేషన్ దాఖలు అయ్యినట్లయ్యింది.

నామినేషన్ పత్రాలు అందిస్తున్న రాజేష్

జెడ్‌పి చైర్మన్ పీఠం ఎవరికో..!

ప్రస్తుత చైర్మన్ కవురు ఎంఎల్‌సి బరిలోకి

ఖాళీ కానున్న జెడ్‌పి చైర్మన్ పదవి

బిసి రిజర్వుడు కావడంతో ఆ జెడ్‌పిటిసిల్లో ఆశలు

ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మంది బిసి జెడ్‌పిటిసిలు

మేకా శేషుబాబుకు జెడ్‌పి చైర్మన్ ఇవ్వనున్నట్లు ప్రచారం

ఖాళీ కానున్న యలమంచిలి నుంచి పోటీ చేయనున్నట్లు చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం ఎవరికి దక్కనుందోననే చర్చ వైసిపిలో పెద్దఎత్తున సాగుతోంది. జెడ్‌పి చైర్మన్ పదవి బిసికి రిజర్వుడు కావడంతో ఆ సామాజిక తరగతికి చెందిన జెడ్‌పిటిసిలంతా ఈ పదవిని ఆశిస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతమున్న బిసి జెడ్‌పిటిసిల్లో ఎవరికైనా పదవి ఇస్తారా.. లేక వైసిపి అధిష్టానం కొత్త ఆలోచన చేస్తుందా అనే చర్చ సైతం నడుస్తోంది. ప్రస్తుత జెడ్‌పి చైర్మన్ కవురు శ్రీనివాస్‌ను స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థిగా వైసిపి ఎంపిక చేసింది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి పదవులు వైసిపి చేజిక్కించుకోనుండటంతో కవురుకు ఎంఎల్‌సి పదవి దాదాపు ఖాయమైనట్లే. దీంతో జెడ్‌పి చైర్మన్ పీఠం ఖాళీ కానుంది.



జిల్లా పరిషత్ చైర్మన్ పదవీ కాలం దాదాపు మూడున్నరేళ్ల వరకూ ఉంది. దీంతో ఈ పదవి కోసం బిసి జెడ్‌పిటిసిలు తమ ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 48 జెడ్‌పిటిసి స్థానాలు ఉన్నాయి. దీనిలో జెడ్‌పి చైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న యలమంచిలి స్థానం మినహాయిస్తే భీమడోలు, భీమవరం, కాళ్ల, మొగల్తూరు, నరసాపురం, పాలకోడేరు, పెదపాడు, ఉండి, ఉంగుటూరు జెడ్‌పిటిసిలు బిసిలు. నాలుగుచోట్ల పురుష జెడ్‌పిటిసిలు ఉండగా, ఐదుచోట్ల బిసి మహిళలు ఉన్నారు. అంతా జెడ్‌పి చైర్మన్ పదవికి అర్హులే. పెదపాడు జెడ్‌పిటిసి గంటా పద్మశ్రీ పేరు ఛైర్‌పర్సన్ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి పదవులు రెండు డెల్టా ప్రాంతానికి ఇవ్వడంతో మెట్ట ప్రాంతానికి జెడ్‌పి చైర్మన్ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. అయితే వైసిపి అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

తెరపైకి మేకా శేషుబాబు పేరు?

జెడ్‌పి చైర్మన్ పదవి ఖాళీ కానుండటంతో ఆ పదవి మాజీ జెడ్‌పి ఛైర్మన్, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబుకు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ మేరకు అధిష్టానం మేకా శేషుబాబుకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి కోటాలో పదవి కోసం మేకా శేషుబాబు చివరి వరకూ గట్టి ప్రయత్నం చేశారు. అయితే ఎంఎల్‌సి పదవిని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌కు ఇస్తున్నట్లు వైసిపి ప్రకటించింది. ఖాళీ కానున్న జెడ్‌పి ఛైర్మన్ పదవి శేషుబాబుకు ఇవ్వనున్నట్లు అధిష్టానం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కవురు శ్రీనివాస్ యలమంచిలి జెడ్‌పిటిసిగా ఉన్నారు. ఎంఎల్‌సిగా ఎన్నిక ప్రక్రియ పూర్తికాగానే కవురు జెడ్‌పిటిసి, జెడ్‌పి ఛైర్మన్ పదవులకు రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఖాళీ అయిన యలమంచిలి జెడ్‌పిటిసి స్థానానికి ఎన్నికలు నిర్వహించి ఆస్థానం నుంచి మేకా శేషుబాబును పోటీ చేయించాలని వైసిపి అధిష్టానం ఆలోచన చేసినట్లు సమాచారం. అధికారం వైసిపికి గెలుపు సునాయాసమనే అభిప్రాయం ఉంది.

జెడ్‌పిటిసిగా గెలిచిన తర్వాత శేషుబాబును జెడ్‌పి ఛైర్మన్ చేయాలని అధిష్టానం ఆలోచన చేసినట్లు చెబుతున్నారు. గతంలో మేకా శేషుబాబు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి స్థానిక సంస్థల కోటాలో ఎంఎల్‌సిగా గెలిచారు. అక్కడ నుంచి ఆయన వైసిపిలోనే ఉన్నారు. అప్పట్లో జెడ్‌పి ఛైర్మన్‌గా ఉన్న కారుమూరి ఎంఎల్‌ఎగా గెలుపొంది వెళ్లిపోయారు. దీంతో కొంతకాలం అప్పట్లో బిసి రిజర్వుడుగా ఉన్న జెడ్‌పి ఛైర్మన్ పదవి మేకా శేషుబాబును వరించింది. జెడ్‌పి ఛైర్మన్‌గా గతంలోనూ పని చేసిన అనుభవం శేషుబాబుకు ఉంది. దీంతో శేషుబాబుకే జెడ్‌పి ఛైర్మన్ పదవి ఇచ్చేందుకు వైసిపి అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

సిహెచ్‌సి సేవల మెరుగుకు చర్యలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

భీమడోలు మండలంలో సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా మరింత మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలో పర్యటించారు. దీనిలో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, కురెళ్లగూడెం, సూరప్పగూడెం రైతుభరోసా కేంద్రాలను సందర్శించారు. తొలుత భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్న కలెక్టర్ వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, చికిత్స విధానం, వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఇతర అవసరాల కోసం ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన అభివృద్ధి కమిటీ నిధులు వినియోగించాలని అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చింతా రాము, పర్యవేక్షకులు డాక్టర్ శ్వేతకు సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మాణానికి ప్రతిపాదించిన ట్రామా కేర్ సెంటర్‌పై ఆరా తీశారు. అయితే ఇప్పటికే రూ.2.53 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఔట్ పేషెంట్ బ్లాక్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుపై బాధ్యులతో మాట్లాడారు. ఆరోగ్య కేంద్రం సరిహద్దులను ఖరారు చేసి, మెరక చేసే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి సహకరిస్తామన్నారు. ప్రస్తుతం సామాజిక ఆరోగ్య కేంద్రం కొనసాగుతున్న ప్రాంతం ఎగువున గల చెరువు ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి చెరువును పునరుద్ధరించాలని సూచించారు. రెండు జాతీయ రహదారుల మధ్య ఉన్న భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ఉత్తమ వైద్య సేవలందించేందుకు అవసరాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అనంతరం కలెక్టర్ కురెళ్లగూడెం, సూరప్పగూడెం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను సందర్శించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, ప్రయోజనాలు, రైతులు కోరుతున్న ఇతర సౌకర్యాలపై రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రైతుభరోసా కేంద్రాల ద్వారా తమకు అవసరమైన ఏర్పాట్లను వ్యవసాయ శాఖ చేస్తుందని తెలిపారు. ఎరువులతోపాటు పురుగుమందులు అందుబాటులో ఉంచాలని వారు కోరారు. అనంతరం సూరప్పగూడెం రైతుభరోసా కేంద్రం పరిధిలోని క్లస్టర్ హైరింగ్ సెంటర్‌కు వ్యవసాయ శాఖ మంజూరు చేసిన వరి కోత యంత్రం ద్వారా అందుతున్న సేవలపై రైతులను అడిగారు. ఈ సందర్భంగా రైతులు యంత్రం ద్వారా వరి కోతకు ఎకరాకు రూ.2,400 చెల్లిస్తున్నామని వివరించారు. భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి మాట్లాడుతూ మండల పరిధిలో ఇ-పంట నమోదు నూరుశాతం, ఇకెవైసి నమోదు 85 శాతం పూర్తయ్యాయన్నారు. రెండు రోజుల్లో వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటామని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషారాజకుమారి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

సిహెచ్‌సిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

మంచి సమాజానికి శ్రీశ్రీ రచనలు దోహదం

ప్రజాశక్తి - ఏలూరు

శ్రీశ్రీ తన రచనలతో సమాజంపై ఎనలేని ప్రభావం చూపించారని సాంస్కృతిక రంగం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. రెడ్‌బుక్ డే సందర్భంగా మంగళవారం సాయంత్రం సిఐటియు జిల్లా కార్యాలయంలో సాహితీ స్రవంతి నేత కె.రామాంజనేయులు అధ్యక్షతన శ్రీశ్రీ మహాప్రస్థానం పుస్తక పఠనం నిర్వహించారు. ముఖ్యఅతిథి సీతారాం మాట్లాడుతూ ప్రపంచంలో కారల్‌మార్క్స్, ఎంగెల్స్‌లు రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక అనే చిన్న పుస్తకం ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రభావం చూపిందన్నారు. ఆ ప్రభావంతో ఆయా భాషల్లో అనేక మంది రచయితలు, కవులు గొప్పగొప్ప రచనలు చేశారన్నారు. ఆ కోవలోకే తెలుగులో శ్రీశ్రీ వస్తారన్నారు. శ్రీశ్రీ మహాప్రస్థానం పుస్తకం తెలుగు సమాజంపై చాలా పెద్ద ప్రభావం చూపిందన్నారు. శ్రీ శ్రీ విప్లవ రచయితతోపాటు ప్రముఖ సినిమా కవి కూడా అని గుర్తు చేశారు. తెలుగు, తమిళంలో విడుదలైన ఆకలి రాజ్యం సినిమా అంతా శ్రీ శ్రీ రచించిన కవితలే కనిపిస్తాయన్నారు. అంతర్జాతీయ తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా సీతారాం తదితరులు గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి, కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, హేలాపురి బాలోత్సవం నిర్వహణ కమిటీ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.సుందరయ్య, ఐలు నేత కట్టా సత్యనారాయణ, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు విజిఎంఆర్.కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను మాతృభాషలోనే కొనసాగించాలని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు పి.కస్తూరిబాయ్ తెలిపారు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం రెడ్ బుక్ డే సందర్భంగా స్థానిక అశోక్‌నగర్‌లోని కెపిడిటి స్కూల్లో మాట్లాడారు కస్తూరిబాయి మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం పాకిస్తాన్ ఉర్దూను మాతృభాషగా ఎంపిక చేసుకోగా బంగ్లాదేశ్ మాత్రం బెంగాలీని మాతృభాషగా ఎంపిక చేసుకుందని 1951లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా జరుపుకోవాలని ప్రపంచదేశాలు నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పి.ఆదిశేషు మాట్లాడుతూ ఫిబ్రవరి 21న అంతర్జాతీయంగా పుస్తకప్రియులు రెడ్‌బుక్ డే గా నిర్ణయించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా మహాకవి శ్రీశ్రీ రచించిన మహాకావ్యం మహాప్రస్థానంలోని జయభేరి కవితలోని 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను.. నేను సైతం విశ్వసృష్టికి అశ్రు ఒక్కటి ధారపోశాను. నేను సైతం భువన ఘోషకు వెర్రి గొంతుక విచ్చి మోశాను' అను కవితను పఠనం చేశారు. ముందుగా కెపిడిటి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రేమ్‌చంద్ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం రెడ్‌బుక్ డే గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానం పుస్తకంపై బహిరంగ అధ్యయన వేదిక నిర్వహించారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో రెడ్‌బుక్ డే కార్యక్రమాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ మానవుడే నా దేశం మనుష్యుడే నా సంగీతం అని ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ అని అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు పి.సూర్యారావు, వి.గోపి, జి.సూర్యకిరణ్, బొడ్డు రాంబాబు, యాగంటి సీత, జిఎస్.నారాయణ, జి.విజయశ్రీ, కెఎస్.నారాయణ, బి.నాని, పి.సునీల్, బి.మణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీతారాం

నూతన విద్యావిధానంతో అంతా అస్తవ్యస్థం : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

నూతన విద్యావిధానం పేరిట రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల, నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందని సిపిఎం జిల్లా కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. గత జులై, ఆగస్టు నెలల మధ్య ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సుదూర ప్రాంతాల్లోని హైస్కూళ్లలోకి విలీనం చేసిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 149, ఉమ్మడి జిల్లాలో 289 పాఠశాలల్లోని సుమారు ఆరు వేల మంది పైచిలుకు బాలబాలికలను ఉన్నత పాఠశాలల్లో కలిపేసిందని పేర్కొన్నారు. దీంతో పాఠశాలల్లో 1, 2 తరగతులు చదివే చిన్నారుల సంఖ్య గణనీయంగా తగ్గిందని, ఇప్పుడు ఈ సాకుతో జిల్లాలో 10 మంది కంటే తక్కువ ఉన్న 84 పాఠశాలలను మూసేయడానికి విద్యాశాఖ ప్రయత్నాలు ప్రారంభించిందని విమర్శించారు. దీంతో ప్రాథమిక విద్య పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2021-22 విద్యా సంవత్సరంలో జిల్లాలో 1.87 లక్షల మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేయగా 2022-23 నాటికి వీటి సంఖ్య 1.62 లక్షలకు పడిపోయిందని గణంకాలు తెలుపుతున్నాయని, దీన్నిబట్టే రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ఈ నూతన విద్యావిధానం విఫలమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రాథమిక విద్యను అందరికి అందుబాటులోకి తేవాలని, ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయాలని, విద్యార్థులకు మెరుగైన విద్యను ఉచితంగా అందించాలని, కొత్తగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్‌సి ప్రతియేటా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.పదివేలు వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ.పది వేలు వేతనం ఇవ్వాలని మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శ బుచ్చిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలపూడి ఎంఇఒ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించి, ఎంఇఒ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఒక్కో విద్యార్థికి మెనూ బిల్లు రూ.20 చెల్లించాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు షేక్ ఫకీరమ్మ, డి.లక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రభుత్వం అటవీ బంజరు భూములను పేదలకు పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి సాకా గంగరాజు అధ్యక్షతన మంగళవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జెవి.సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణచైతన్య మాట్లాడుతూ పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని తెలిపారు. టి.నరసాపురం, బందంచర్ల గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న అటవీబంజరు భూముల్లో వనసంరక్షణ సమితులను ఏర్పాటు చేసి భూమి లేని పేదలకు కుటుంబానికి హెక్టారు చొప్పున భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల రూపంలో ప్రజలను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. పేదలకు మెరుగైన జీవన విధానం భూమిని సాగుచేయడం ద్వారానే లభిస్తుందని తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు భూమిదక్కే వరకూ పేదల పక్షాన సిపిఐ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పుప్పాల కన్నబాబు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు, గుడిమూరి పాపారావు, వీరంకి వెంకట్రావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రైతులు తమ పంటను ఇ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని అంకన్నగూడెం, కామయ్య పాలెం, బర్రింకలపాడులో పలుపంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి గంగాధర్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

విరాళాల ద్వారా చినవెంకన్నకు రూ.1.68 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

చినవెంకన్నకు యాత్రికుల విరాళాల ద్వారా రూ.1,68,56,159 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు తెలిపారు. అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్య హుండీలను మంగళవారం లెక్కించారు. 19 రోజులకుగాను పైన పేర్కొన్న నగదు, 198 గ్రాముల బంగారం, 4 కేజీల 230 గ్రాముల వెండి, పాత రూ.వెయ్యి నోటు ఒకటి, రూ.500 నోట్లు 23, ఇతర దేశాల కరెన్సీ సైతం వచ్చినట్లు తెలిపారు.

హుండీలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ధాన్యం బకాయిల కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

రైతుసంఘం ఆధ్వర్యాన కొత్తూరులో ధర్నా

ప్రజాశక్తి - పెదపాడు

రైతులకు, కౌలురైతులకు ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో కొత్తూరు రైతుభరోసా కేంద్రం వద్ద మంగళవారం రైతులు, కౌలురైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు, కౌలురైతులు రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం అమ్మి 40 రోజులు గడుస్తున్నా ధాన్యం సొమ్ము చెల్లించకపోవడం అన్యాయమన్నారు. అప్పు చేసి పెట్టుబడి పెట్టి పంట పండించి అమ్మితే ధాన్యం సొమ్ము చెల్లించకపోవడం వల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 9వ తేదీ తర్వాత రైతులకు ధాన్యం సొమ్ము చెల్లించలేదన్నారు. కొత్తూరు ఆర్‌బికె పరిధిలో సుమారు రూ.3 కోట్లు, కొత్తముప్పర్రు ఆర్‌బికె పరిధిలో సుమారు రూ.4 కోట్లు ధాన్యం బకాయిలులి చెల్లించాల్సి ఉందన్నారు. ధాన్యం బకాయి సొమ్ము వడ్డీతో చెల్లించి ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దిబోయిన కాశీవిశ్వనాథం, పల్లపోతు శ్రీనివాసరావు, పల్లపోతు రెడ్డియ్య, కన్నెగంటి పూర్ణచంద్రరావు, చెన్నుబోయిన దుర్గారావు, దన్నే నాగేంద్రరావు, శనగల సత్యనారాయణ, కడిమి రాజు, చెడుగొండి సూర్యనారాయణ, కవ్వూరి రాంబాబు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

ముగిసిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు

రేపటి పౌరులను ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. స్థానిక కస్తూరిబా పాఠశాలలో రెండురోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సభకు జెసి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకతను, శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల ఉన్న అవగాహన విద్యార్థుల ప్రదర్శనల్లో ప్రస్ఫుటంగా కనబడుతున్నాయని, అందరు విద్యార్థులు కూడా డాక్టర్లు ఇంజనీర్లనే అనే కాకుండా శాస్త్రవేత్తలుగా కూడా అభివృద్ధి చెందాలని అన్నారు. విజేతలను అభినందిస్తూ, మిగతా వారు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని రాబోయే ప్రదర్శనలు మంచి ఆలోచన పురికొల్పే విధంగా ఉండాలని కోరారు. డిఇఒ ఎన్‌వి.రవి సాగర్ మాట్లాడుతూ జిల్లాలోని 28 మండలాలకు సోమ, మంగళవారాల్లో ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. ఐదు అంశాల్లో పదిమందిని విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఫెయిర్ ఆఫీసర్ చౌదరి, డివైఇఒలు సేవియా, రామన్నదొర, స్థానిక ఎంఇఒ సబ్బితి నరసింహమూర్తి, డిఐ డి.సాంబశివరావు, డిసిఇబి సెక్రెటరీ ఎ.సర్వేశ్వరరావు, స్థానిక ప్రధానోపాధ్యాయిని సునీత, జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బహుమతి ప్రదానోత్సవం అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

బహుమతులు అందిస్తున్న జెసి అరుణ్‌బాబు

ఆందోళన చేస్తున్న వ్యాపారులు

మొండి బకాయిదారుల ఆస్తులు జప్తు

దుకాణాలు సీజ్ చేయడంపై వ్యాపారులు అభ్యంతరం - రోడ్డుపై బైఠాయించి ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణాలలో ఆస్తి పన్ను మొండి బకాయిల వసూలులో మున్సిపల్ అధికారులు ఆస్తుల జప్తుకు సైతం వెనుకాడటం లేదు. మంగళవారం పట్టణంలోని ప్రముఖ రాజకీయ నాయకుడు మండవల్లి విజయసారథికి చెందిన దుకాణాలను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. 16 అసెస్మెంట్‌లకు రూ.42,94,701 పన్ను చెల్లించాలని ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ తెలిపారు. ఇప్పటికీ విజయసారథి నుండి స్పందన లేకపోవడంతో జప్తుకు సిద్ధమయ్యామని తెలిపారు. ఈ క్రమంలో స్థానిక బోసుబొమ్మ సెంటర్ వద్ద దుకాణాలను సీజ్ చేశారు. విజయసారది అందుబాటులో లేకపోవడం వల్ల కొంత గడువు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ భవానిప్రసాద్‌ను అక్కడ ఉన్నవ్యాపారులు కోరారు. ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేశామని, గడువు ఇవ్వడం కుదరదని అధికారులు వెల్లడించారు.

రోడ్డుపై బైఠాయించి వ్యాపారులు నిరసన

ఉన్నఫళంగా దుకాణాలను జప్తుచేస్తే అద్దె చెల్లిస్తున్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతామని వాపోయారు. ఈ క్రమంలో వ్యాపారులు నష్ట పోకుండా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వరావు, శ్రీనివాస రెడీమేడ్ వ్యాపార దుకాణాల సముదాయానికి చెల్లించాల్సిన బకాయి సొమ్ము రూ 5,35,340 వెంటనే చెల్లిస్తామని మున్సిపల్ అధికారులను కోరారు. కానీ మొత్తం బకాయి చెల్లించాలని అధికారులు పట్టుబట్టారు. దీంతో వ్యాపారులకు న్యాయం చేయాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వందనకు వెంకటేశ్వరరావు, కొందరు వ్యాపారులు మున్సిపల్ కమిషనర్ వాహనానికి అడ్డుగా రోడ్డుపై బైఠాయించారు. ఈ నేపథ్యంలో స్థానిక సిఐ బాల సురేష్ బాబు, ఎస్ఐ సాగర్‌బాబు సంఘటన ప్రాంతానికి చెరుకుని వ్యాపారులతో చర్చించారు. మొండిబకాయి యజమాని అందుబాటులో లేకపోవడం వల్ల శ్రీనివాసరెడ్డి దుకాణ సముదాయాలకున్న బకాయి సొమ్ము కట్టించుకుని వ్యాపారులకు ఉపశమనం కలిగించాలని కోరారు. దీంతో చర్చల అనంతరం వందనపు వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు రూ.5,35,340 చెల్లించారు. ఆనంతరం సంబంధిత దుకాణానికి వేసిన సీల్‌ను మున్సిపల్ సిబ్బంది తొలగించారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి

ప్రజాశక్తి - మండవల్లి

బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండి విద్యనభ్యసించేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రధానోపాధ్యాయులు మేడ శ్రీనివాసరావు తెలిపారు. లింగాల ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఒకటో తరగతి విద్యార్థి పాఠశాలకు సక్రమంగా రాకపోవడంపై ఆయన విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మంగళవారం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, దుస్తులతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. విద్యార్థులకు విద్యలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా అన్ని సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. అంతేకాకుండా విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా నాడు-నేడు కార్యక్రమంలో పూర్తిస్థాయిలో పాఠశాలలను సుందరంగా ఆకర్షణీయమైన రంగులతో బొమ్మలను వేసి ప్రభుత్వ పాఠశాలలను ధీటుగా మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేస్తున్నారని ఆయన వివరించారు. క్రమం తప్పకుండా పిల్లలను పాఠశాలకు పంపించేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని వివరించారు. అయితే ఆరోగ్యం కారణంగా విద్యార్థిని పాఠశాలకు పంపలేదని ఇకనుండి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రెండేళ్లు పూర్తయిన సందర్భంగా

సర్పంచులకు పలువురి అభినందనలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు సర్పంచి దంపతులు

సర్పంచులుగా ఈనెల 21వ తేదీతో రెండేళ్ల పదవీకాలం పూర్తిచేసుకుని మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా భీమడోలు, పోలసానిపల్లి గ్రామ సర్పంచులను పలువురు అభినందించారు. భీమడోలు సర్పంచి పి.సునీత మార్నింగ్ తన హయాంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో ముద్రించిన క్యాలెండరును ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు సోమవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. పోలసానిపల్లి సర్పంచి రోజీమా హసేనను పలువురు గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అభిమానులు వారి ఇంటి వద్ద కలిసి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచి దంపతులు రోజీమా బేగం హసేన, ప్రతిభాశాలి రెండేళ్ల కాలంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో సైతం ఇదే ఒరవడి కొనసాగించాలని కోరారు. ఇద్దరు సర్పంచులు తాము ఇంత స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు అభివృద్ధికి సహాయ సహకారాలే కారణమని పేర్కొన్నారు.

నేరాలు - ఘోరాలు

విషపూరిత నీరు తాగి 4 గొర్రెలు మృతి..!

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రం చాట్రాయి గ్రామానికి చెందిన కాలసాని సోమేశ్వరరావు, ఆవల పుల్లయ్యకు చెందిన 60 గొర్రెలు విషపూరిత నీరుతాగి నాలుగు గొర్రెలు చనిపోయాయి. మిగిలిన గొర్రెలు తీవ్ర అనారోగ్యానికి గురయ్యాయి. గొర్రెల యజమానులు మాట్లాడుతూ సోమవారం చాట్రాయి సమీపంలోని దీప చెరువు ప్రాంతంలో గొర్రెల మందను మేత కోసం తోలుకెళ్లారు. మేత మేసిన తర్వాత సాయంత్రం సమయంలో గొర్రెలు చెరువులో నీరు తాగాయి. ఆ తర్వాత రాత్రికి గొర్రెల దొడ్డిలోకి తీసుకెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున గొర్రెలదొడ్డికి వెళ్లి చూడగా గొర్రెల ముక్కుల్లో నుంచి నీళ్లు లాగా కారడం, గురక, పారడం, కడుపు ఉబ్బడం వంటి లక్షణాలు గమనించి వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం అందించారు. వైద్యసిబ్బంది హుటాహుటిని వచ్చి వైద్యం చేస్తుండగా నాలుగు గొర్రెలు కడుపు ఉబ్బరం పెరిగిపోయి ఊపిరాడక చనిపోయాయి. అయితే ఆ చెరువులో చేపలకు మందు వేశారు. ఆ నీటిని తాగడం వల్లే గొర్రెలు చనిపోయాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పశువైద్య సిబ్బంది వివరణ అడగగా విషపూరితమైన ఆహారంగానీ, నీరు గాని తీసుకోవడం వల్లే గొర్రెలు చనిపోయాయని, మిగిలిన గొర్రెలకు వైద్యం అందించడంతో కోలుకుంటున్నాయని తెలిపారు. ఒక్కొక్క గొర్రె విలువ రూ.15 వేలు ఉంటుందని, మిగిలిన గొర్రెలు ఎన్ని కోలుకుంటాయో, ఎన్ని మరణిస్తాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాలికల ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - చింతలపూడి

సోమవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి వెళ్లిపోయిన ఇద్దరు బాలికలు పెళ్లిచేసుకుని మంగళవారం దర్శనమిచ్చారు. ఈ ఘటనకు సంబంధించి చింతలపూడి సిఐ మల్లేశ్వరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు సోమవారం పాఠశాల నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. ఈ విషయాన్ని గుర్తించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఎస్ఐ చెన్నారావు కేసు నమోదు చేసి రెండు బృందాలుగా ఏర్పడి విద్యార్థుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలికలు వినియోగించిన సెల్‌ఫోన్ల ఆధారంగా వీరిద్దరూ మరో ఇద్దరు యువకులతో కలిసి నూజివీడు, విస్సన్నపేట ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులను అప్రమత్తం చేశారు. అయితే ఈ విషయం తెలుసుకున్న ఇద్దరు యువకులు ఒక బాలికను విస్సన్నపేటలో, మరో బాలికను గోకవరంలో రహస్య ప్రదేశంలో ఉంచారు. మంగళవారం ఉదయం ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా బాలికలు దాచిన స్థలాన్ని చూపించారు. అక్కడకు వెళ్లి బాలికలను స్టేషన్‌కు తీసుకొచ్చారు. అయితే ఇద్దరు యువకులు తమను ప్రేమించాలని వెంటపడుతున్నారని, ఇంటినుంచి బయటకు తీసుకెళ్లి బలవంతంగా పెళ్లి చేసుకున్నట్లు బాలికలు తెలిపారు. దీంతో సంబంధిత సెక్షన్ కింద కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

దర్భగూడెం రేషన్ దుకాణంలో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సిఐ శివరామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇక్కడి రేషన్‌షాప్‌లో ఇతర దుకాణాల ద్వారా రేషన్ బియ్యాన్ని కార్డుదారుల నుంచి తక్కువకు కొనుగోలు చేసి వాటిని వ్యాన్‌లో తరలిస్తున్నట్లు సమాచారం అందినట్లు చెప్పారు. ఈ మేరకు దాడులు చేసి ఐషర్‌వ్యాన్‌లో 115 క్వింటాల బియ్యంతో పాటు, దానికి ఎస్కార్ట్‌గా వెళ్తున్న కారును కూడా పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. మొత్తం రూ.13 లక్షల విలువైన కారు, ఐషర్‌వ్యాను, బియ్యంను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే రేషన్ డీలర్ శ్రీను, మిరావలితో సహా మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయిస్ డిటి శ్రీనివాస్ తెలిపారు.

కారు బోల్తా: ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- మండవల్లి

కల్వర్టు నిర్మించేందుకు తవ్విన గుంతలో కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం హైదరాబాద్‌కు చెందిన ప్రసాద్ తన భార్య, కుమార్తెతో కలిసి భీమవరం కారులో వెళుతున్నారు. మంగళవారం రాత్రి 8:30 గంటల సమయంలో ప్రత్తిపాడు దగ్గరకు వచ్చేసరికి కల్వర్టు నిర్మాణం కోసం తవ్విన గుంతలోకి కారు బోల్తా పడింది. పెద్ద శబ్దం రావడంతో ప్రత్తిపాడు సెంటర్లో ఉన్న జనం అక్కడకు చేరుకుని కారులో ఉన్న ముగ్గురిని బయటకు తీశారు. వారికి స్వల్పగాయాలే కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆ ప్రాంతంలో కల్వర్టు నిర్మిస్తున్నట్లు హెచ్చరికలు బోర్డులు లేకపోవడం ప్రమాదానికి కారణమైందని, బోర్డులు పెట్టని కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధితుడు ప్రసాద్ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముగించుకుని కైకలూరు వెళ్తున్న ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎంహెచ్ఎ ఆధ్వర్యంలో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలతో అలంకరించి పుష్పాంజలి ఘటించారు. సంస్థ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి, కళారత్న కెవి.సత్యనారాయణ, కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, సహాయ కార్యదర్శులు ఎల్.వెంకటేశ్వరరావు, సిహెచ్.సాయితేజ, ఉపాధ్యక్షులు బివి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉభయ కమిటీల సభ్యులు లంకా వెంకటేశ్వర్లు, డాక్టర్ గుడిపాటి లలితశర్మ, మోతే శ్రీనివాసనారాయణరావు, నాట్యాచార్య దువ్వి హేమసుందర్, ఎం.సూర్యనారాయణ యాదవ్, ఎ.పార్వతి రామచంద్రన్, జిల్లెళ్లమూడి వరప్రసాద్, కె.సాంబశివరావు పాల్గొన్నారు. చిన్నారులు మా తెలుగుతల్లికి గీతం ఆలపించారు. వక్తలు మాట్లాడుతూ తెలుగు భాషా, సంస్కృతి, సాంప్రదాయలకు, కళలకు సంస్థ పెద్దపీట వేస్తుందని తెలిపారు. తీయ్యనైన చక్కటి మన మాతృభాష తెలుగును కాపాడుకోవాల్సిన, అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆ దిశగా అందరం కృషి చేయాలని కోరారు.

టి.నరసాపురంలో మాట్లాడుతున్న సాగర్

టి.నరసాపురం: ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక భాషలు, సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యదర్శి బిఎన్.సాగర్ అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో అరసం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం కారణంగా మాతృభాషకు మరణ శాసనం రాసినట్లేనన్నారు. మన భాషను, సంస్కృతిని రక్షించుకోవడానికి భవిష్యత్‌లో అందరూ మాతృభాష పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రాంతి నికేతన్ విద్యార్థులు కళ్యాణి, కార్తిక, అంజలి, సాయిసూర్య, విద్యార్థులు దివ్యశ్రీ, పద్మప్రియ, విజన్‌స్కూల్ విద్యార్థులు కావ్య, నాగలక్ష్మి, నిత్యశ్రీ, హర్షిత ప్రసంగించారు. కార్యక్రమంలో పాత్రికేయులు యు.ప్రసాద్‌బాబు, గ్రంథాలయ అధికారి ఆర్.కిషోర్, పురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : నారాయణపురం, శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కొండా రవి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ వెంకట్ లాల్, రెడ్డియ్య, వెంకటేశ్వర్లు, రాజు, భాస్కర్‌రావు, ఉమాశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక సిఎస్‌టిఎస్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని వైభవంగా తెలుగు శాఖ తరపున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసరావు, ముఖ్యఅతిథి తెలుగు ఉపన్యాసకురాలు డాక్టర్ బి.సరస్వతి, కళాశాల అధ్యాపకులు, డాక్టర్ జి.వెంకటలాల్, పి.నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు : ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజ అన్నారు. రాష్ట్రంలో అన్ని దేవాదాయ శాఖ కమిటీలలో నాయీ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి జగన్ ప్రాతినిధ్యం కల్పించిన నేపథ్యంలో చింతలపూడి నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శాసనసభ్యులను ఘనంగా సన్మానించారు. వైసిపి కమిటీ సభ్యులను పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల నాగేశ్వరరావు ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నాయీ బ్రాహ్మణసంఘం మండల అధ్యక్షులు పరిమి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు ఆచంట సాయి, పరిమి రమేష్, హనుమంతరావు, నాగేశ్వరావు, గంగాధర్‌రావు, అప్పారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - కైకలూరు

గ్రామస్థాయిలో పార్టీ పటిష్టత కోసం గ్రామ కన్వీనర్లు, గృహసారధులు కష్టించి పనిచేయాలని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు కోరారు. మంగళవారం స్థానిక సీతారామ ఫంక్షన్ హాల్లో మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలోని కన్వీనర్లకు, గృహసారధులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామ సచివాలయ కన్వీనర్లు గృహ సారధులు పార్టీ ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని ఎమ్మెల్యే డిఎన్‌ఆర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, జెడ్‌పిటిసి సభ్యులు కురేళ్ల బేబీ, వైసిపి మండల అధ్యక్షులు బత్రాజు శివాజీ, సర్పంచి నవరత్న కుమారి, ఉప్పలపాటి నాగమణి, ఘంటసాల శేషారావు, జయమంగళ కాసులు, గరికిముక్కు మరియమ్మ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయండి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తిచేయాలని హౌసింగ్ ఇఇ నరసింహారావు తెలిపారు. మంగళవారం దర్భగూడెం పంచాయతీలో నిర్మిస్తున్న ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణంలో మొదటి విడతలో మంజూరైన ఇళ్లను వేగంగా పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వం నుంచి మెటీరియల్ కూడా అందేలా చేస్తామన్నారు. హౌసింగ్ సిబ్బంది వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సువర్ణ, సురేష్, జగన్ రెడ్డి పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉపాధి హామీ చట్టంలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రఫుల్ సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి మండలాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అప్పగించిన టార్గెట్‌లను వెంటనే పూర్తి చేయలన్నారు. అదే విధంగా నూతనంగా పనులు జరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జాన్ వెస్లీ, మూడు మండలాల ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్లఫారంలో తనిఖీలు

ప్రజాశక్తి - చాట్రాయి

చీపురుగూడెంలో జర్మనీ టెక్నాలజీతో బొట్టు లక్ష్మణరావు ఇటీవల నిర్మించిన కోళ్లఫారాన్ని జిల్లా ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ కోళ్ల ఫారానికి పంచాయతీ అనుమతి లేదని, ఫారెస్ట్ భూమిలో ఫారం నిర్మించారని, దీనివల్ల వాతావరణం కలుషితపై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని గ్రామానికి చెందిన ఒబిళ్లనేని వసంతరావు లోకాయుక్తలో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డిఎంహెచ్‌ఒ ఎ.రవి, జిల్లా ఫారెస్ట్ అధికారి, జిల్లా పొల్యూషన్ బోర్డు సభ్యులు కోళ్లఫారంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు, ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్, మండల వైద్యాధికారి లీనా బెంజిమెన్ పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే ధరల పెరుగుదల

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి అధికారం చేపట్టిన తర్వాత నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని టిడిపి చింతలపూడి పట్టణ అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, ఐటిడిపి నియోజకవర్గ కన్వీనర్ బోడా అవినాష్ విమర్శించారు. స్థానిక పదో వార్డు రామకృష్ణనగర్‌లో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మన్యం సత్తిబాబు, జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, నాయకులు గెడ్డమడుగుల విక్రమ్ నాయుడు, అంగన్వాడీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సుందరమ్మ, టౌన్ ఉపాధ్యక్షులు పొదిలి రాయప్ప, మండల ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఏసు, నాయకులు పాల్గొన్నారు.

నారాయణపురం - ఉండి రోడ్డు హద్దుల నిర్ధారణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం - ఉండి రాష్ట్రీయ రహదారికి ఇరువైపులా హద్దులను నిర్ధారించేందుకు మంగళవారం అధికారులు కొలతలు చేపట్టారు. ఆర్‌అండ్‌బి, మేజర్ ఇరిగేషన్, డ్రెయినేజీ, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో సర్వే చేసి హద్దులను నిర్ణయించారు. ఏలూరు కాలువపై నారాయణపురం వద్ద వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో సిఎం రూ.8.50 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ క్రమంలో వంతెన నిర్మాణానికి వీలుగా ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమి, దాని హద్దులు నిర్ణయించేందుకు సర్వే చేపట్టారు. సర్వే నంబరు 257లో ప్రస్తుతం ఆర్‌అండ్‌బి తారు రోడ్డు సుమారు ఐదు మీటర్లు ఉంది. రోడ్డుకు ఇరువైపులా చాలావరకూ ఆక్రమణలో ఉన్నాయి. వాటిని తొలగించేందుకు వీలుగా పక్కాగా సర్వే చేసి హద్దులు నిర్ణయించి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయాల్సి ఉందని ఆర్‌అండ్‌బి అధికారులు చెప్పారు.

నీటిపారుదలకు ఆటంకంగా కల్వర్టు నిర్మాణం

అడ్డుకున్న అధికారులు

ప్రజాశక్తి - మండవల్లి

నీటి ప్రవాహానికి ఇబ్బంది కలగకుండా ఉండేలా కల్వర్టులను సక్రమంగా నిర్మించాలని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నీటి ప్రవాహానికి అడ్డుపడేలా ఏర్పాటు చేస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను ఆక్వా రైతులు మంగళవారం అడ్డుకున్నారు. నిర్మాణదారుడు రైతులతో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తూ ఆయనకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఆయన నిర్మాణదారునితో మాట్లాడటానికి ప్రయత్నించగా పొంతనలేని సమాధానం చెప్పడంతో ఆయన నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. ఈ పంట కాలువ ద్వారా వచ్చే నీటిపై ఆధారపడి గ్రామాల్లోని ప్రజలతో పాటు వందలాది ఎకరాల చేపలచెరువులు సాగవుతున్నాయని తెలిపారు. అయితే కల్వర్టును వంకరగా నిర్మిస్తున్నారని అందువల్ల నీటి ప్రవాహం సజావుగా ఉండదని, దీంతో గ్రామాల్లోని ప్రజలకు తాగునీరు అందకుండా పోతుందని, అంతేకాకుండా ఆక్వా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఎఇకి తెలిపారు. నీరు సజావుగా పారేలా కల్వర్టు నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీంతో నీటిపారుదల శాఖ ఎఇ కిషోర్ నిర్మాణదారుణ్ని ప్రశ్నించారు. ఇక్కడ వంటకాలపై కల్వర్ట్ ఏర్పాటుకు అనుమతులు లేవని, తక్షణం నిలుపుదల చేయాలని సూచించారు. ప్రజల, రైతుల అభీష్టం మేరకే అనుమతులు తీసుకుని కల్వర్టు నిర్మించాలన్నారు.

వైభవంగా పెద్దింట్లమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి - కైకలూరు

ఆలయంలో డిఎన్‌ఆర్, జయమంగళ

కొల్లేటికోట పెద్దింట్లమ్మ వారి జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ ఈ ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ పులవర్తి లక్ష్మణ్, ఇఒ వేణుగోపాలరావు, ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను, జయ మంగళ వెంకటరమణ, వడ్డీ కార్పొరేషన్ ఛైర్మన్ సైదు గాయత్రీ సంతోషి, కైకలూరు జెడ్‌పిటిసి సభ్యులు కురెళ్ల బేబీని ఆలయ మర్యాదలతో అధికారులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అలంకారాలు, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండవల్లి జెడ్‌పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల, సర్పంచులు జయమంగళ కాసులు, బత్తిన ఉమామహేశ్వరరావు, సైదు వెంకటేశ్వరరావు, ఎంపిటిసి బలే నరేష్, ఘంటసాల నాగమణి, దేవస్థాన పాలక మండలి సభ్యులు, నాయకులు పంజా రామారావు, ముంగర నరసింహారావు, సయ్యపరాజు గుర్రాజు, రూరల్ సిఐ వైవివిఎల్.నాయుడు, ఎంపిడిఒ రామలింగేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కానుకొల్లు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - మండవల్లి

జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కానుకొల్లు పాఠశాల విద్యార్థిని జిల్లా ప్రథమస్థానం సాధించింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వి.రవిసాగర్ ద్వారా ప్రశంసాపత్రం అందుకున్నట్లు ఉపాధ్యాయులు కె.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఏలూరులోని కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో ఈనెల 20, 21న నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జి.హేమశ్రీ వక్తృత్వ పోటీల్లో జిల్లా ప్రథమ స్థానం, వ్యాసరచనలో జిల్లా ద్వితీయ స్థానం సాధించిందని తెలిపారు.

వెలుగు విఒఎలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు

గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు పొదుపు సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్న వెలుగు విఒఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా సమావేశం ఎస్‌కె.సుభాషిని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. విఒఎలను తొలగించేందుకు జారీ చేసిన కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. 20 సంవత్సరాలుగా గ్రామాల్లో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి స్వయం సహాయక గ్రూపులను ఏర్పాటు చేస్తున్న విఒఎలను తొలగించాలని చూడడం అన్యాయమన్నారు.

రాష్ట్రపతి పాలన విధించాలి : ముద్దరబోయిన

ప్రజాశక్తి - నూజివీడు

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు రాష్ట్రపతి పాలన విధించాలని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతలు పరిరక్షించాల్సిన పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారారన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించడంతోపాటు నిరంతరం ప్రతిపక్ష నాయకులపైన, కార్యాలయాలపైన దాడులకు తెగబడుతుంటే అడ్డుకోవాల్సిన పోలీస్ వ్యవస్థ మాత్రం వైసిపి రౌడీమూకలకు తోడ్పాటునందిస్తోందన్నారు.

పోస్టర్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లో సుందరీకరణలో భాగంగా ఏలూరును పోస్టర్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుండి కొత్త బస్టాండ్ వరకూ ఉన్న పోస్టర్లను మంగళవారం కమిషనర్ ఆధ్వర్యంలో తొలగించారు. సందర్భంగా కమిషనర్ వెంకటకష్ణ మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గోడలు, రోడ్డు వెంబడి, డివైడర్లు పలు భవనాలపై పోస్టర్లు అంటించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోస్టర్లు ఎక్కడపడితే అక్కడ అంటించే వారిపై చర్యలు తీసుకుని పెనాల్టీలు విధిస్తామన్నారు.

బలివే ఆలయానికి రూ.35.71 లక్షల ఆదాయం

ముసునూరు : బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ.35,71,720 ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు తెలిపారు. మంగళవారం హుండీలను లెక్కించారు. హుండీలు, దర్శనం టికెట్ల ద్వారా రూ.12,86,020, స్థలాలు ఆద్దె రూ.10,50,000, కొబ్బరిచిప్పల వేలం పాట ద్వారా రూ.రెండు లక్షల ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.4,86,520 అధిక ఆదాయం వచ్చినట్లు ఇఒ తెలిపారు.

జామాయిల్ ప్లాంటేషన్ పరిశీలన

జీలుగుమిల్లి: దర్భగూడెం అటవీశాఖ పరిధిలోని జామాయిల్ ప్లాంటేషన్‌ను ఎపిఎఫ్‌డిసిఆర్ ఎం.సత్యంగుప్తా మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దర్భగూడెం ప్లాంటేషన్ పరిధిలో కటింగ్‌కి వచ్చిన జామయిల్ ప్లాంటేషన్‌లోని డేటాను పరిశీలించారు. పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

గణపవరం: గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పి.కిరణ్మయి మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకూ గర్భిణులకు హెచ్‌బి పరీక్షలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ విల్సన్‌బాబు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి అరాచకాలు ఎంతో కాలంసాగవు : కాపా

నూజివీడు: వైసిపి అరాచకాలు ఎంతోకాలం కొనసాగవని నూజివీడు ఎఎంసి మాజీ ఛైర్మన్, రావిచర్ల గ్రామ సర్పంచి, టిడిపి సీనియర్ నేత కాపా శ్రీనివాసరావు అన్నారు. నూజివీడు పట్టణంలోని ఎన్‌టిఆర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు అక్కినేని చందు, జెడ్పిటిసి మాజీ సభ్యులు అరికోటి పౌల్రాజ్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ముసునూరు: ప్రతీ రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని ఫిజియోథెరపిస్ట్ జి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం ముసునూరు మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్నమణి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే వీల్‌ఛైర్లు ఇద్దరికి, మరో ఇద్దరికి హియరింగ్ ఎడ్స్ పంపిణీ చేశారు.

26న సుబ్బమ్మదేవి హైస్కూల్ వజ్రోత్సవం

ఏలూరు: ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఈదర సుబ్బమ్మ దేవి నగరపాలక ఉన్నత పాఠశాలను స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవ వేడుకలను ఈనెల 26వ తేదీన పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్కూల్ పూర్వ విద్యార్థుల ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రత్న కుమార్ తెలిపారు. ఈ వజ్రోత్సవ కార్యక్రమానికి గత 75 సంవత్సరాల నుండి ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు, చదువు చెప్పిన గురువులు, దేశ విదేశాల నుండి ఈ కార్యక్రమానికి తరలిరానున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల విశిష్టత ప్రతిబింబించేలా సుమారు 200 ద్విచక్ర వాహనాలతో ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుండి ఏలూరు పట్టణ ముఖ్య కూడళ్ల మీదుగా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీ ఫైర్ స్టేషన్, పాత బస్టాండు, తంగెళ్లమూడి, లక్ష్మివారపుపేట, అశోక్ నగర్, కొత్త బస్టాండు మొదలగు ముఖ్య ప్రాంతాల మీదుగా సాగుతుందన్నారు.

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

O.S. 630/2020

Between:
Canara Bank (e-Syndicate Bank), Tanuku, Rep. by its Manager -వాది
AND
1. Vathumilli Anvesh, S/o. Venkata Naga Raju, Permanent Resident of Tanuku, A.P.
2. Vathumilli Venkata Naga Raju, S/o. Pothu Raju, Tanuku, A.P. -ప్రతివాద్దు

వాదికి వసూలు కావలసియున్న బాకీ మొత్తము **రూ. 9,39,587-03 పైసలు** దర్మిలా వడ్డీ మరియు ఖర్చులు నిమిత్తము ప్రతివాద్దు పై దావా దాఖలు చేసియున్నారు. సదరు పై నెంబరు దావా, ప్రతివాద్దు 1 మరియు 2 హాజరు నిమిత్తము ది. 27-03-2023న వాయిదా అయి ఉన్నది. 1 మరియు 2 ప్రతివాద్దు **ది. 27-03-2023వ తేదీన** పైన తెల్పిన మహారాజశ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ **10.30** ని॥ల లగాయితు స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ యొక్క ఆక్షేపణలు దాఖలు చేసుకోవలెను. ఇందుకు తప్పే యెడల పై నెంబరు దావా 1, 2 ప్రతివాద్దు యొక్క పరోక్షము నందు తీర్మానింపబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది. యీ ప్రకటన ది. 13-02-2023వ తేదీ గల కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము ప్రకటించడమైనది.

సి.యస్.వి.యస్.బుస్సీ
తణుకు వాది తరపు న్యాయవాది
22-2-2023 తణుకు, సెల్:9989567750

In The Court Of The Principal Senior Civil Judge :: Eluru

E.P.No. 21/2020
O.S.No. 166/2017

Between:
Nekkanti Suryanarayana Murthy ...D.H.R
AND
1) Chodem Muthyam
2) Chodem Surya Paul Manohar
3) Chodem Surya Paul Anvesh ...J.D.R's

వేలం ప్రకటన

పై నెంబరు గల ఇ.పి.లో డిక్రీ బాకీ రాబట్టుకొనే నిమిత్తం జడ్జిమెంటు డెటారు /ప్రతివాది సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో గల ఈ క్రింది ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.14-03-2023వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయుదురు.** ఎవరైననూ వేలం పాలటలో పాల్గొని స్థిరాస్థిని వేలంపాటలో పాడుకొనవచ్చును. షరతులు వర్తించును.

E.P.Schedule

An extent of 222 Square Yards of Site and a Terraced Building therein with bearing the D.No.3-62/1, wered by R.S.No.146/2 of Eluru (V), Peddapadu (M), W.G.District, Vatluru Sub Registrer within the following boundaries:
East: Joint Bazar.
South: Property of Matta Srinivasa Rao.
West: Property of RaniMekalaBadrachalam.
North: Property of Matta Nice Babu.
D.H.R. Value : Rs. 15,00,000/-
Amina Value : Rs. 18,32,000/-
NEKKARAGANTI NARASIMHA RAO
Eluru, Advocate, Ashok Nagar,
20-2-23. Eluru. Cell: 98481 18984

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: ఏలూరు

E.P.No. 37/2019
in O.S.No. 65/2016

బిట్వీన్:
వేమా సత్యనారాయణ మరియొకరు
...పిటీషనర్లు /డిక్రీ హోల్డర్స్
మరియు
పులి గోపాలరావు
...రెస్పాండెంటు /జడ్జిమెంటు డెటార్

పై నెంబరు డిక్రీ అమలు పిటీషను గ్రంథములో ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్థిని, పై శ్రీకోర్టు వారి ఎదుట **ది.13-03-2023న ఉదయం గం॥10:30 ని॥లకు బహిరంగ వేలం ద్వారా అమ్మకం జరుపబడును.** సదరు వేలంలో పాల్గొనదలచినవారు సదరు తేదీన పై కోర్టు వారి ఎదుట స్వయంగా హాజరై పాడుకొనవచ్చును. పాట షరతులు వగైరా విషయముల గురించి కోర్టు నజారత్ వారిని సంప్రదించగలరు.

వేలపు షెడ్యూలు ఆస్థి వివరం

In West Godavari District, Eluru Sub-di, Eluru Mandal, Jalipudi Panchayat, Jalipudi Village, R.S.No. 281, Zirayathi wet land admeasuring Ac.0-92 Cents Bounded by:
East: Land Of Kola Prasad.
South: Land Of Surat Rama Rao.
West: Land Of Pydipati Rama Krishna.
North: Land Of Bandi Srinivas.
డిక్రీ హోల్డర్ విలువ : రూ.18,20,000/-
అమీనా విలువ : రూ.23,92,000/-

గమనిక: వేలంలో పాల్గొనదలచిన పాటదారులు పై వేలపు తేదీన వారియొక్క ఆధార్ కార్డుతో హాజరై వారి యొక్క అఫిడవిట్ దాఖలు చేయవలయును. వేలం ముగిసిన వెంటనే Highest Bidder తను పాడిన మొత్తంలో 1/4వ వంతు సొమ్ము శ్రీవారి కోర్టులో డిపాజిట్ చేయవలయును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

కోరుకొండ రాజారామమోహన్
జి.వి.రమణమూర్తి
డిక్రీ హోల్డర్స్ తరపున న్యాయవాదులు,
అగ్రహారం, ఏలూరు-534001.